


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సినీ 'మాలోకం'

**మృగతృష్ణ అంటే ఎండమావులని** నాకూ తెలుసు. కానీ నేను చెప్పేది మృగాల మీద ఉండే తృష్ణ. అంటే జంతు దాహం గురించి. ఈ మధ్య సినిమాలలో హీరోలకి ఈ మృగాలంటే విపరీతమైన పిచ్చి పెరిగి పోయింది.

"నేను పులిని.. పెద్దపులిని"

"నేను గెడ్డం చేసుకుంటాను... సింహం గెడ్డం చేసుకోదు అంతే తేడా"

"పందులే మందలు మందలుగా వస్తాయి.. ఏనుగు ఒంటరిగా వస్తుంది."

"సింహం బజ్జుందని జూలుతో జడెయ్యాలని చూడకు."

మరి తోకతో ముడెయ్యాలా? ఇలా వాళ్ళని వాళ్ళు జంతువులతో పోల్చుకోవడం ఎక్కువయిపోయింది. అంతేకాదు. ఇదివరకు హీరో అంటే ధీరోదాత్తుడూ, తెలివైన వాడూ, నీతిమంతుడూ, స్థితప్రజ్ఞుడూ, మంచివాడూ అని చెప్పే డైలాగులు రాసేవారు.

ఇప్పుడు హీరోలు

"నాకు కాస్త తిక్క"

"నేను ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే వినను"

"ఒరేయ్ నాకు మామూలు పిచ్చ కాదురోయ్.. కొరికెయ్యగలను."

"వాడు ఎప్పుడు ఎవర్ని కొడ్తాడో వాడికే తెలీదు" లాంటి డైలాగ్ రాయించుకుంటున్నారు.

ఇంక తొడ కొట్టడం మీద పేటెంట్లు తీసుకున్నట్లు "తొడకొట్టాలంటే మా వంశంలోనే పుట్టాలిరోయ్."

"వంశం పేరు చెప్పుకుని తొడకొట్టుకునే జాతికాదు మాది" లాంటి డైలాగ్స్ రాయించుకుంటున్నారు.

డైరెక్ట్‌గా వాళ్ళ పర్సనల్ జీవితాల గురించే డైలాగ్స్ రాయించేస్తున్నారు.

"నా ఇంటిపేరు ఎన్ అంటే నిల్. నాకు ఇంటిపేరే లేదు. పెళ్ళయితే పెళ్ళాం ఇంటి పేరే నాదవుతుంది" అంటాడు ఒక ఫేమస్ వంశంలో మనవడైన హీరో.

ఇంకో హీరో "మొన్న కాపులబ్బాయి, రెడ్లమ్మాయిని చేసుకుని సుఖంగా లేడూ?" అని తన మీద తనే డైలాగ్ వేసుకుంటాడు. అంతే కాకుండా "వీడు ముదురైతే వీడి నాన్న దేశముదురురోయ్" లాంటివి రాసి తండ్రుల్ని కూడా సంతోషపెడుతున్నారు.

'మెగాస్టార్' ఫోటో చూసి అతని తమ్ముడు "ఈయనెవరూ?" అంటే "అతనో పెద్ద హీరో లెండి" అనడం. "నాకు తెలీదే" అని అతను అనడం లాంటివి అభిమానులని వెర్రెత్తిస్తాయని నిర్మాతలకి తెలుసు.

పాటల్లో కూడా వాళ్ళ వంశం గురించి, వాళ్ళ గొప్పల గురించి భజన పాటలు రచ్చ రచ్చగా వస్తున్నాయి.

ఇంక సినిమాల పబ్లిసిటీలో భాగంగా, వివాదాల జోరు చెప్పనే అక్కర్లేదు.

ఫలానా సినిమాలో 'ఆడామగా' కాని వారి మీద జోకుంది 'వారి' మనోభావాలని' దెబ్బతీసింది'

"ఫలానా సినిమాలో బ్రాహ్మల్ని వెక్కిరించారు. వారి మనోభావాల్ని కించపరిచారు"

"కసాయి అన్న పదం వాడారు. అది ఓ కులం, వారి మనోభావాలు దెబ్బతిన్నాయి" అంటూ రోజూ సెన్సార్ బోర్డ్ మీద జనం విరుచుకుపడుతున్నారు. అయినా అలాంటి డైలాగులు రాస్తూనే ఉన్నారు.

చివరికి ట్రయిలర్ కి 'A' సర్టిఫికెట్ వచ్చిందని కూడా వివాదం. ఇదివరకు ఏ సినిమాకి 'A' సర్టిఫికెట్ వచ్చిందో పెద్దగా తెలిసేది కాదు. ఒకటో రెండో సినిమాలకి 'A' సర్టిఫికెట్లు వస్తే, పెద్దాళ్ళు ఆ సినిమాలకి పిల్లలు వెళ్ళకుండా జాగ్రత్తపడేవారు.

ఇప్పుడు ఒకటో రెండో సినిమాలకి 'U' సర్టిఫికెట్ వస్తే పిల్లలు ఆ థియేటర్ల వైపుకి కూడా వెళ్ళకుండా జాగ్రత్తలో ఉంటున్నారు.

నెలకి ముప్పై సినిమాలు సెన్సార్ అయితే ఇరవై సినిమాలు 'A' సర్టిఫికెట్ తెచ్చుకుంటున్నాయి. చిన్నప్పుడు మా స్కూల్లో 'A' గ్రేడ్ రావడం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు నిర్మాతలకి చాలా తేలికైపోయింది.

ఇటీవల డిజిటల్ సినిమాలు వస్తున్నాయి. ఇరవై లక్షలుంటే సినిమా! కొన్ని విజయవంతం అయి నిర్మాతలకి డబ్బు కూడా తెచ్చి పెట్టాయిట.

కథ చాలా సింపుల్. పదిమంది అబ్బాయిలకూ, పదిమంది అమ్మాయిలూ !(ముక్కూ, మూతీ తిన్నగా ఉండనక్కర్లేదు. అబ్బాయిలకి జుట్టుతో, అమ్మాయిలకి ముసుగులతో కప్పబడి ఉంటాయి.)

ఈ పది జంటలు పార్కుల్లో, కాలేజీల్లో, సినిమా హాళ్ళల్లో రొమాన్స్ చేసుకుంటూ ఉంటాయి. 'కాదేదీ కవితకి అనర్హం' అన్నారు. శ్రీ శ్రీ కాదేదీ బూతుకి అనర్హం అన్నట్లు ఈ వేళ 'తాళం కప్ప, చెవీ' నుండి, క్రికెట్ బ్యాటూ, వికెట్సూ', 'సెల్‌ఫోన్, సిమ్‌కార్డూ' అని బూతు పదాలకి ప్రత్యామ్నాయాలుగా వాడుతూ బూతులు వరదలా యధేచ్ఛగా వాడుతున్నారు.

కథకి కాళ్ళుండవు. ఒకచోటే కేంద్రీకృతమై ఉంటుంది. ముచ్చటైన బూతులతో, రెండు గంటలపాటు వీనుల విందు చేస్తే థియేటర్ల దగ్గర మన యువత క్యూలు కడుతున్నారు.

అసలు కాలేజీలు అంటే అసహ్యం పుట్టేట్లు హాస్యం. ప్రొఫెసర్లూ, లేడీ లెక్చెరర్లూ కాలేజీలో ప్యూన్లూ అంతా బూతే మాట్లాడ్తారు. అవసరం అయితే క్లాసు రూమ్స్ అద్దెకిచ్చేట్లు కూడా చూపిస్తున్నారు.

**ఈ రోజుల్లో** అమ్మాయిల డైలాగ్స్ వింటే 'ఔరా' అనిపిస్తుంది. అబ్బాయిలని తమ షాపింగులకీ, డిన్నర్‌లకీ, సినిమా టిక్కెట్లకీ మాత్రమే వాడుకుంటారని, వరుసగా సినిమాలొచ్చాయి. అమ్మాయిలేం ప్రతిఘటించలేదు. పాపం వాళ్ళ మనోభావాలు కూడా దెబ్బతిని ధర్నాలు చెయ్యలేదు.

**బస్ స్టాప్‌లలో,** హాస్టల్స్‌లో అమ్మాయిలు మందుకొట్టడం, తమ బోయ్ ఫ్రెండ్స్ గురించి పచ్చిగా మాట్లాడుకోవడం, ఒకేసారి ఇద్దరు ముగ్గురుతో ప్రేమాయణం సాగించడం, తల్లితండ్రుల్ని మోసం చెయ్యడం సర్వసాధారణం. అందరు పిల్లలూ ఇంతే అన్న తరహాలో సినిమాలు వస్తున్నాయి. త్రి జి లవ్ లు, ఫోర్ జి లవ్ లు కూడా వస్తున్నాయి.

లవ్ అంటే ఈ రోజుల్లో డెఫినిషన్ ఏమిటో?

ఓ సినిమాలో ఒక తండ్రి కొడుకుతో అంటాడు "ఊరూర్కే సిమ్ మార్చకురా. నేను చూడు ఒకే సిమ్‌తో ఎన్నో ఏళ్ళుగా కాలక్షేపం చేస్తున్నాను" అని తల్లిని చూపిస్తాడు కొడుకుకి.

ఇంకో తండ్రి కూతురితో "ఈ లాప్‌టాప్ హార్స్ పవర్‌ది. ఎంజాయ్... నొక్కుకో... ఏమైనా చేస్కో" అని అసహ్యమైన భావం కనపరుస్తూ ప్రెజెంట్ చేస్తాడు

ప్రతి డైలాగుకీ ద్వందార్థాలు పోయాయి. కనీసం మూడు అర్థాలు ఉన్న రోజులొచ్చాయి. తల్లితండ్రులతో, అన్నదమ్ములతో కాదు, కనీసం సభ్యత కల స్నేహితులతో కూడా కలిసి చూడడానికి సిగ్గుపడే రోజులొచ్చాయి.

ఇంక హాస్యం.. ఒకప్పుడు సినిమాల్లో హాస్యం చాలా సున్నితంగా ఉండేది.

శివరావు, నల్లరామ్మూర్తి, సీతారాం, పేకేటి శివరాం, రేలంగీ, అల్లురామలింగయ్యా, వంగరా, రమణారెడ్డి తర్వాత వచ్చిన పద్మనాభం, రాజబాబుల హాస్యం కూడా నవ్వించేది.

ఈ హాస్యం రాయడానికి అప్పలాచార్యలాంటి హాస్య రచయితలు ప్రత్యేకంగా ఉండేవారు.

మాయాబజార్‌లో 'తల్పం గిల్పం' సీన్, చెప్పులు మంచం ఎక్కడం, కంబళి తిరగబడడం, మంచం గిరగిరా తిరగడం లాంటివి చూసి పెద్దలూ చిన్నలూ కడుపుబ్బ నవ్వేవాళం.

'గుండమ్మకథ'లో, "నీ పేరు తెలీని వాళ్ళెవరూ? ఎవరికి చెప్పినా 'అమ్మో గుండమ్మగారి సంబంధమా?'మా కొద్దు బాబోయ్' అంటున్నారు" అని రమణారెడ్డి అంటే చక్కలిగింతలు పెట్టినట్లు నవ్వొచ్చేది.

మిస్సమ్మలో మొగుడూ పెళ్ళాలు కాని వాళ్ళని మొగుడూ పెళ్ళాలు అనుకోవడం, సీమంతం చెయ్యడం 'సీమంతం అంటే పుట్టినరోజు కన్నా.. కాస్తపెద్దది' అని ఎన్.టీ.ఆర్ సావిత్రికి చెప్పడం, ఎంత సున్నితత్వంతో కూడిన శృంగారం!!

ఆ రోజుల్లో 'సుమంగళి' లాంటి సినిమాలు రావడం ఎంత సాహసం? అంతటి సున్నిత విషయాన్ని ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎంత చక్కగా దృశ్యీకరించారూ!? భర్త 'ఇంపొటెంట్' అన్నది మామూలు విషయమా? అదీ ఏ.ఎన్.ఆర్, సావిత్రిల మీద.

ఆ తరువాత బాలచందర్ గారి సినిమాలొచ్చాయి. అప్పటిదాకా 'ఇలా చూపించవచ్చా?' అని తెలీని విషయాలని తెరకెక్కించి, అద్భుతంగా కళాఖండాలని నిర్మించారు.

సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి ఇంటిల్లపాదినీ పోషించడం కోసం పడుపు వృత్తి చేసే అమ్మాయి కథ 'జీవిత రంగం'గా తెరకెక్కిస్తే దుఃఖమే వచ్చింది కానీ అశ్లీలం అనిపించలేదు. (తమిళంలో బాలచందర్ తీసారు)

కూతురు వయసున్న అమ్మాయిని ఒక మధ్య వయస్కుడు ప్రలోభానికి గురయి ఒక జీవితాన్నీ, కుటుంబాన్నీ పాడు చేయడం 'గుప్పెడు'మనసులో 'భళారే' అన్నట్లు చూపించారు.

'అంతులేని కథ'లో ఒక పెళ్ళికాని అమ్మాయి కథ, 'ఇది కథ కాదు'లో పెళ్ళయి శాడిస్ట్ భర్త చేతిలో నరకం చూసిన యువతి కథ.

ఫారెన్ కంట్రీలో ఇంకో పెళ్ళాం ఉండగా, ఇక్కడకొచ్చి అమాయకమైన అమ్మాయిని పెళ్ళి చేసుకెళ్ళి, పనిమనిషని ఆ భార్యకి చెప్పే ప్రబుద్ధుడి కథ 'నలభై ఏడు'రోజుల్లో. ఇలా ఏ సబ్జెక్ట్ తీసుకున్నా, చిక్కని స్క్రీన్‌ప్లేతో, చక్కని డైలాగ్‌లతో, కడుపుబ్బ నవ్వించే హాస్యంతో గొప్ప గొప్ప చిత్రాలు వచ్చాయ్.

'తూర్పూ పడమర,' కన్యా కుమారి', 'చిల్లరకొట్టు చిట్టెమ్మ', 'స్వర్గం నరకం,' 'కోరికలే గుర్రాలైతే' లాంటివి దాసరి కూడా సామాజిక ప్రయోజనాన్ని ఆశించి వైవిధ్యంగా సినిమాలు నిర్మించారు.

ఇప్పుడొస్తున్న హాస్యం గురించి చెప్పకుండా ఈ టాపిక్ ముగించకూడదు.

బ్రహ్మానందం, ఎం.ఎస్.నారాయణా, ఆలీ ఏం పాపం చేసారో కానీ వాళ్ళ చెంపలు హీరోలు వాయిస్తూనే ఉంటారు. మాట మాటకీ కొడ్తారు. సౌండ్ ఎఫెక్ట్స్‌లో అలా వాళ్ళ బుగ్గలు బూరెలయ్యేట్లు వాయిస్తుంటే, అవి వాచి, వాళ్ళు గిర్రున తిరుగుతుంటే జనానికి ఎందుకు నవ్వొస్తుందో తెలీడంలేదు.

ఇంక వాళ్ళ ప్రైవేట్ పార్ట్స్ మీద ఎగిరెగిరి తన్నడం, ఆలీ మొన్న ఓ సినిమాలో ఎగిరి ఒక రాడ్ మీద పడితే, అది సెంటర్‌లో గుచ్చుకుంటుంది. అప్పుడు అతని ముఖభంగిమలు చూసి హాల్లో జనం క్లాప్స్ కొడుతూ నవ్వడం చూసాను.

ఇది వారిలోని శాడిజానికి పరాకాష్టా? లేక ఆ హీరో మీదున్న గుడ్డి అభిమానమా? అర్ధం కాలేదు. ఒక మనిషి బాధపడ్తుంటే మనకి ‘నవ్వు‘ రావడం ఆరోగ్యకరమైన విషయమేనా?

ఓ పక్కన చండీయాగం, తద్దినం పెడుతూ మటన్‌లూ, చికెన్‌లూ తినే బ్రాహ్మణుల్ని చూపించడం హాస్యమే అనుకున్నా, వారి భార్యల్ని అసహ్యంగా, వయ్యారలు పోతూ, పరాయి మగాళ్ళకి వలలేసేట్లు చూపించడం, అదీ మడికట్టులో.. హాస్యమా?

‘ఆంటీ.. ‘ అన్న పదానికే బూతు అర్ధం వచ్చేట్లు డైలాగ్ రైటర్స్ రాస్తున్నారు. ఒక వయసొచ్చాక నడివయసు గృహిణులు కుర్రకారు సైగలు చేస్తుంటే, సిగ్గుపడడం, మురిసిపోవడం, కొన్నిసార్లు ప్రోత్సహించడం. ఇవన్నీ హాస్యాలా? ఆడవారికి ఎంత ఇబ్బందిగా ఉంటాయి?

సెన్సార్ వారి పరిస్థితి అడకత్తెరలో పోక చెక్క చందం. కట్ చేస్తే నిర్మాతలు రివైజ్‌డ్ కమిటీలకి వెళ్తారు.

కట్ చెయ్యకపోతే మహిళాసంఘాలూ, మిగతా సంఘాలూ వచ్చి ధర్నాలు చేసి మెంబర్ల దిష్టి బొమ్మల్ని దహనం చేస్తారు.

పెద్ద హీరోల సినిమాలకి కథలు అక్కర్లేదు. అప్పుడే హిట్ ఇచ్చిన డైరెక్టర్ ఉంటే చాలు, నిర్మాతలు డేట్స్ తీసుకుని ఎనౌన్స్ చేసేస్తున్నారు. అప్పుడు కథ గురించి కసరత్తు మొదలవుతుంది. నాలుగు కథలు హిట్ అయినవి ఉంటాయి. అవి తిప్పి తిప్పి ప్రతి హీరో చేతా చేయిస్తారు. ఇంక సినిమాలో హీరోకన్నా కమేడియన్స్ ఎక్కువసేపు ఉంటారు. ‘పంచ్‘ డైలాగులుంటాయి. హీరో చేతిలో తన్నులు తినడం ఉంటుంది. ఓ రీమేక్ సాంగ్ (వాళ్ళ నాన్నదో, తాతదో అయితే మరీ మంచిది) ఉంటుంది. విచిత్రమైన విలన్స్ ఉంటారు. ఇందులో రెండు రకాలు. కోటా, రావురమేష్, సాయాజీ షిండే, ముఖేష్ రుషీ, జయప్రకాష్ నారాయణ లాంటి వాళ్ళు హాస్య విలన్లు. ఇంక సోనూసూద్, ప్రకాష్ రాజ్ లాంటి వాళ్ళు క్రూరమైన విలన్లు.

ఏం పాపం చేసాయో టాటా సుమోలు ఎగిరెగిరి ఢీ కొని ‘ఢాం‘మ్మని పేల్తుంటాయి.

బల్లాలూ, గెడ్డ పలుగులూ, వేట కొడవళ్ళూ, కత్తులు (ఓ దర్శకుడైతే ప్రతి సినిమాకీ కొత్త ఆయుధం తయారు చేస్తాడు) తో తలలూ, చేతులూ, కాళ్ళూ, మొండెం ఇష్టం వచ్చినట్లు తరుగుతుంటారు.

ఒకడ్ని హత్య చేసాడన్న నేరం హీరో మీదకొస్తే, అది తను చెయ్యలేదు నిరపరాధినని రుజువు చేసుకోవడానికి వంద మందిని నరుకుతాడు. (వాళ్ళంతా జూనియర్ ఆర్టిస్టులు కాబట్టి శిక్షలుండవు కాబోలు)

ఇంతా చేసి విలన్ చివరికి ‘నువ్వు మగాడివిరా! నువ్వే గెలిచావు‘ అనగానే అసలు విలన్‌ని వదిలి పెట్టేస్తాడు. అతని చుట్టూ ఉన్న వాళ్ళందర్నీ దారుణంగా చంపుతాడు.

నేను ఇరవై లక్షల సినిమాల గురించి చెప్పాను.

నలభై కోట్ల సినిమాల గురించి కూడా చెప్పాలి.

కార్లు రెక్కల గుర్రాల్లా ఎగిరి స్కై స్క్రేపర్స్ లాంటి భవంతులలోంచి ఎగురుకుంటూ వెళ్ళడం, అనవసరంగా హెలికాప్టర్లలో, ఓ పనికి రానివాడ్ని తరిమి తరిమి పట్టుకోవడంలాంటి హీరో ఇంట్రడక్షన్ సీన్లకి కోట్లు కోట్లు ఖర్చు అవుతాయి.

ఒక హీరోని పోలీసులు ఆఖర్న సంకెళ్ళు వేసి పట్టుకెళ్తుంటే, ‘ఆపండి.. అతన్ని అరెస్ట్ చేస్తే మమ్మల్నీ అరెస్ట్ చెయ్యాల్సిందే‘ అనడానికి, వేలలో వచ్చే జూనియర్ ఆర్టిస్టులకి ఖర్చు అవుతుంది. మన రాష్ట్రంలో, దేశంలో ఎప్పుడూ మన పక్షాన పోరాడిన ఏ దేశభక్తుడి

కోసం మనం ఇలా 'ఆగండి. అతన్ని విడిచిపెట్టండి.. అతను నిరపరాధి' అని ఊరేగింపుగా వెళ్ళిన దాఖలాలు లేవు. పట్టపగలు అమ్మాయిలని దారుణంగా మానభంగం చేస్తేనే దిక్కులేదు. సినిమాల్లో మాత్రం జనం నేల ఈనినట్లు హీరో కోసం కోర్టుముందో, పోలీసు స్టేషన్ చుట్టూనో గుమిగూడతారు.

ఇంక హీరోలు హీరోయిన్లతో 'ఇస్తాన్ బుల్'లో 'స్వీడన్'లో 'లాస్ ఏంజెల్స్'లో 'నయాగరాఫాల్స్' దగ్గరా పాటలు పాడడానికీ, వాళ్ళ కాస్టూమ్సుకీ బోలెడు అవుతుంది. అసలు హీరో హీరోయిన్లు పాత సినిమాల్లో 'మెల్ల మెల్ల మెల్లగా.. అణువణువూ నీదిగా' అనో 'చుక్కలతో చెప్పాలని .. ఏమనీ? ఇటు చూస్తే తప్పనీ..'

'ఎందుకనీ?'

'ఇక్కడ ఏకాంతంలో.. ఏమో ఏమేమో అనీ.." అంటూ ఏకాంతంగా పాడుకునేవారు.

ఇప్పుడు హీరో వెనక ఇరవైమందీ, హీరోయిన్ వెనక ఇరవైమందీ, అప్పటిదాకా ముక్కూ మొహం తెలియని వాళ్ళు ఇలాంటి కాస్ట్యూమ్సులోనే వచ్చి వీళ్ళ కన్నా ఎక్కువగా విరుచుకుంటూ, వీళ్ళకి ఏకాంతం లేకుండా చేస్తుంటారు. అప్పుడు 'ఇస్తాన్‌బుల్' వెళ్ళినా 'ఏడుపాయల జాతర' వెళ్ళినా ఒకటే. ఒక్క ఆటలో డబ్బులు రావడానికి వందల ప్రింట్స్ వేసి రిలీజ్ చేస్తారు.

హీరో ఇంట్రడక్షన్‌కీ, క్లైమాక్స్ ఫైట్‌కీ సగం కోట్లు బడ్జెట్లో ఖర్చు అయిపోతాయి. మిగతా సగం హీరో 'పరాక్రమం' కన్నా, బిల్డింగ్‌లు కూలడం, టాటా సుమోలు పేలడం, హెలికాప్టర్లు కాలడం, కార్లు పగలడం లాంటి వాటికోసం.

కొండని తవ్వి ఎలకని పట్టినట్లు విలన్‌ని చట్టానికి అప్పగించడం, హీరోయిన్‌తో డ్యూయెట్. రెండు వారాలాడితే వందరోజుల పండగ.

"ఎవరి అభిమాన హీరోలకి వాళ్ళు విరివిగా స్టార్స్ ఇస్తూ రివ్యూస్ రాస్తున్నారు వెబ్‌సైట్స్‌లో. అవి ఫాలో అయి సినిమాకి వెళితే మనం దెబ్బ తినక తప్పదు!"

సినిమాల వరస ఇదైతే ఇంక టీ.వీల్లో లైవ్ షోలూ, జబర్దస్త్ లాంటి హాస్య ప్రోగ్రామ్‌లలో అశ్లీలం వరదలై పొంగుతోంది. సీరియళ్ళలో విలనిజం విశృంఖలమై రాజ్యమేలుతోంది. వాటికి సెన్సారే లేదు.

**మన తెలుగు ప్రేక్షకులని ఎవరు కాపాడతారు?**

Post your comments

